కన్వెన్షన్ సెంటర్ ప్రారంభోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు కార్తీక్‌రెడ్డి

ఎంబీఆర్ కన్వెన్షన్ సెంటర్ ప్రారంభం

చేవెళ్ల రూరల్, ఆగస్టు 20 : రంగారెడ్డి జిల్లా చేవెళ్ల మండల పరిధి నాన్‌చేరు అనుబంధ గ్రామం కిష్టాపూర్ గ్రామ రెవెన్యూ పరిధిలో మంగళవారం ఏర్పాటు చేసిన ఎంబీఆర్ కన్వెన్షన్ సెంటర్‌ను సినీ నటుడు మోహన్‌బాబు, ఎమ్మెల్యే కాలె యాదయ్య, మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు పట్లోళ్ల కార్తీక్‌రెడ్డి ముఖ్యఅతిథులుగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాజీ ఎంపీపీ బాల్‌రాజ్, గుడిమల్కాపూర్ మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ యాదగిరిని వారు అభినందించారు.

రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలి

ఎంపీడీవో నరేందర్‌రెడ్డికి వినతిపత్రం ఇస్తున్న గ్రామస్తులు

యాచారం, ఆగస్టు 20 : మండలంలోని తక్కళ్లపల్లి గ్రామానికి చెందిన రోడ్డుకు మరమ్మతులు చేయించాలని మాజీ ఉపసర్పంచ్ పగడాల శ్రీశైలం ఆధ్వర్యంలో గ్రామస్తులు మంగళవారం ఎంపీడీవో నరేందర్‌రెడ్డికి వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా పగడాల శ్రీశైలం మాట్లాడుతూ.. నాగార్జునసాగర్ రోడ్డు తక్కళ్లపల్లి గేటు నుంచి తక్కళ్లపల్లి గ్రామానికి వచ్చే రోడ్డు అధ్వానంగా మారిందన్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు రోడ్డు గుంతలమయంగా మారిందని తెలిపారు. ముఖ్యంగా పవర్‌ప్లాంట్ సమీపంలో రోడ్డుపై పెద్ద గొయ్యి ఏర్పడిందని అక్కడ తరుచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని వాపోయారు. ముఖ్యంగా రాత్రిపూట ద్విచక్రవాహనదారులు, పాదచారులు అదుపుతప్పి కిందపడే ప్రమాదం ఉందన్నారు. సంబంధిత అధికారులు స్పందించి వెంటనే రోడ్డుకు మరమ్మతులు చేయించాలని డిమాండ్ చేశారు. లేదంటే గ్రామస్తులంతా కలిసి సాగర్ రోడ్డుపై బైఠాయించి ఆందోళన చేస్తామని హెచ్చరించారు. వినతిపత్రం ఇచ్చినవారిలో గ్రామస్తులు ఉన్నారు.

బాధితులకు న్యాయం చేయాలి

ఆర్డీవోకు వినతి పత్రం అందజేస్తున్న బాధితులు

చేవెళ్లటౌన్, ఆగస్టు 20: బీజాపూర్ రహదారి విస్తరణలో భాగంగా చేవెళ్ల పట్టణ కేంద్రంలో నిర్మిస్తున్న బైపాస్ రోడ్డులో ప్లాట్లు కోల్పోతున్న తమకు పరిహారం ఇచ్చి న్యాయం చేయాలంటూ బాధితులు మంగళవారం చేవెళ్ల ఆర్డీవో సాయిరాంను కలిసి వినతిపత్రం అందజేశారు. సర్వేనెంబర్ 89, 90లలో 2016లో లక్ష్మీనగర్ పేరిట వెంచర్ చేయగా, తాము ప్లాట్లు కొనుగోలు చేసినట్లు వారు తెలిపారు. 2018లో బీజాపూర్ రహదారి విస్తరణ కోసం నోటిఫికేషన్ జారీ చేశారని తెలిపారు. తాము కొనుగోలు చేసిన ప్లాట్లు బైపాస్ రహదారి కోసం సేకరిస్తున్నట్లు పేపర్ నోటిఫికేషన్ ఇచ్చినప్పటికీ పరిహారం మాత్రం అందలేదని వాపోయారు. ఏడేండ్లుగా పరిహారం కోసం ఎదురుచూస్తున్నట్లు బాధితులు తెలిపారు. వినతి పత్రం ఇచ్చిన వారిలో బాధితులు రాజశేఖర్‌రెడ్డి, బస్వరాజ్, సందీప్‌కుమార్, శివకుమార్, రాజేందర్ రెడ్డి, గోవర్ధన్‌రెడ్డి, సుదర్శన్‌రెడ్డి, సతీశ్‌రెడ్డి, ప్రతాప్ రెడ్డి ఉన్నారు.

అండర్‌పాస్ నిర్మించండి

హైవే అధికారులకు వినతిపత్రం అందజేస్తున్న ప్రజాప్రతినిధులు

పెద్దఅంబర్‌పేట, ఆగస్టు 20: ప్రజల సౌకర్యార్థం విజయవాడ జాతీయ రహదారిపై పెద్దఅంబర్‌పేటలోని పసుమాముల వెళ్లే దారిలో అండర్ పాస్ వేయాలని స్థానిక ప్రజాప్రతినిధులు కోరారు. ఈ మేరకు నేషనల్ హైవే అథారిటీ ప్రతినిధులకు మంగళవారం వినతిపత్రం అందజేశారు. వందలాది కాలనీల ప్రజలతోపాటు స్కూల్ విద్యార్థులు, రైతులు అండర్‌పాస్ లేక ఇబ్బంది పడే అవకాశం ఉన్నదని చెప్పారు. ముఖ్యంగా పెద్దఅంబర్‌పేటలో ఎవరైనా చనిపోతే శ్మశానవాటికకు తీసుకెళ్లేందుకు తీవ్రంగా ఇబ్బందులు ఎదురుకానున్నాయని వివరించారు. వీటిని దృష్టిలో పెట్టుకుని పెద్దఅంబర్‌పేటలో అండర్‌పాస్ వేయాలని విన్నవించారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు దండెం కృష్ణారెడ్డి, పసుల రాజేందర్, సిద్దెంకి కృష్ణారెడ్డి, వివిధ పార్టీల నాయకులు కొత్తపల్లి జైపాల్‌రెడ్డి, వడ్డేపల్లి విజయేందర్‌రెడ్డి, చెవుల చిరంజీవి, ఎండీ సత్తార్ తదితరులు పాల్గొన్నారు.

కేజీబీవీలో వసతుల కల్పనకు కృషి

కడ్తాల్, ఆగస్టు 20: కేజీబీవీ పాఠశాలలో వసతుల కల్పనకు కృషి చేస్తున్నట్లు మాజీ ఎంపీటీసీ శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. కొన్ని రోజులుగా కేజీబీవీలో నెలకొన్న నీటి కొరతతో విద్యార్థినులు పడుతున్న ఇబ్బందులపై ఇటీవల స్థానిక నాయకులు ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. ఎమ్మెల్యే ఆదేశాల మేరకు జిల్లా విద్యాధికారి సుశీందర్‌రావు కేజీబీవీని పరిశీలించి సమస్యలను తెలుసుకున్నారు. అలాగే నీటి కొరత నివారణకు బోరు పాయింట్‌ను ఆయన గుర్తించారు. మంగళవారం స్థానిక నాయకులతో కలిసి మాజీ ఎంపీటీసీ బోర్ డ్రిల్లింగ్ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థినుల సమస్యలను పరిష్కరించడానికి ఎల్లప్పుడూ ముందుంటామని తెలిపారు. కార్యక్రమంలో మండల నోడల్ అధికారి జంగయ్య, ప్రిన్సిపాల్ అనిత, మాజీ కోఆప్షన్ సభ్యుడు జహంగీర్‌బాబా, ఎస్‌జీఎఫ్ఐ జోనల్ కార్యదర్శి భీముడు, ఉపాధ్యాయురాలు రాధా, ప్రియాంక, శ్రావ్య సిబ్బంది పాల్గొన్నారు.

రెచ్చిపోయిన దోపిడీ దొంగలు

- షాద్‌నగర్ పట్టణంలోని ఐదు షాపుల్లో చోరీ
- దర్జాగా కారులో వచ్చి దొంగతనానికి పాల్పడిన దుండగులు
- రూ. 5 లక్షల నగదు మాయం

మొయినాబాద్: షెట్టర్ తాళాలు పగలకొట్టిన దృశ్యం

షాద్‌నగర్, ఆగస్టు 20: దోపిడీ దొంగలు రెచ్చిపోయారు.. దర్జాగా కారులో వచ్చి అందినకాడికి దోచుకెళ్లారు. షాపు షెట్టర్లు పగులగొట్టి నగదును లూటీ చేశారు. ప్రధాన దారిలో ఉన్న ఐదు షాపుల్లో వరుస దొంగతనాలు జరిగిన ఘటన షాద్‌నగర్ పట్టణంలో మంగళవారం ఉదయం వెలుగుచూసింది. బాధితులు, పోలీసుల కథనం ప్రకారం పట్టణంలోని జడ్చర్ల రోడ్డులో ఉన్న జీఆర్ ఎలక్ట్రానిక్స్ షాపులో రూ. 1.65 లక్షలు, మహతి ఎలక్ట్రానిక్స్ షాపులో రూ. 1.45 లక్షలు, అంబికా ఎలక్ట్రానిక్స్ షాపులో రూ. 1.5 లక్షలు , కూల్‌డ్రింక్ షాపులో రూ. 10 వేల నగదును దోచుకెళ్లారు. అదేవిధంగా నేషనల్ మార్ట్ సూపర్ మార్కెట్‌లో బట్టలను చోరీచేసి పరారయ్యారు. మంగళవారం తెల్లవారుజామున సుమారు 3.30 గంటల సమయంలో నలుగురు వ్యక్తులు ఓ కారులో వచ్చి చోరీకి పాల్పడినట్లు సీసీ కెమెరాల్లో రికార్డు అయిన విషయాన్ని బాధితులు తెలిపారు. ఈ ఘటనలపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేపడుతున్నట్లు పోలీసులు తెలిపారు.

హైతాబాద్‌లో మూడు దుకాణాల్లో..

షాబాద్ : గుర్తు తెలియని వ్యక్తులు మూడు దుకాణాల్లో చోరీకి పాల్పడిన ఘటన షాబాద్ మండలంలోని హైతాబాద్ గ్రామంలో జరిగింది. షాబాద్ సీఐ కాంతారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. హైతాబాద్ గ్రామంలో మంగళవారం తెల్లవారుజామున 3గంటల సమయంలో నలుగురు గుర్తు తెలియని వ్యక్తులు ఓ వాహనంలో వచ్చి బాలాజీ మొబైల్స్, శ్రీ వినాయక మొబైల్స్, శ్రీ కృష్ణ సూపర్ మార్కెట్‌లో షెట్టర్లు లిప్ట్ చేసి దుకాణాల్లో ఉన్న నగదును ఎత్తుకెళ్లారు. మూడు దుకాణాల్లో కలిపి సుమారు రూ.3లక్షల వరకు నగదు ఎత్తుకెళ్లారు. చేవెళ్ల ఏసీపీ కిషన్, క్రైమ్ ఏసీపీ శాంకర్‌రెడ్డి, సీఐ కాంతారెడ్డి, ఎస్‌ఐలు మహేశ్వర్‌రెడ్డి, నవీన్‌రెడ్డి ఘటనాస్థలానికి చేరుకుని వివరాలు తెలుసుకున్నారు. త్వరలో దుండగులను పట్టుకుంటామని పోలీసులు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామన్నారు.

హార్డువేర్ దుకాణంలో..

మొయినాబాద్ : దుండగులు హార్డ్‌వేర్ దుకాణంలో చోరీకి పాల్పడిన ఘటన మొయినాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం మొయినాబాద్ మండల పరిధిలోని హిమాయత్‌నగర్ చౌరస్తాలో హైదరాబాద్-బీజాపూర్ జాతీయ రహదారి పక్కన ఉన్న జై శ్రీఅశ్వపుర ఎంటర్ ప్రైజెస్, పెయింట్స్ అండ్ శానిటరీ దుకాణాల్లో సోమవారం అర్ధరాత్రి దుండగులు రెండు షెట్టర్ల తాళాలు పగలగొట్టి చోరీకి పాల్పడ్డారు. కౌంటర్ నుంచి కొంత రూ.4వేలు నగదును అపహరించడంతో పాటు సీసీ కెమెరాల డీవీఆర్ దొంగిలించారు. దుకాణ యజమాని మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఘటనాస్థలానికి చేరుకుని చోరీ జరిగిన తీరును పరిశీలించారు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

షాబాద్ : హైతాబాద్‌లో దొంగతనం జరిగిన దుకాణాన్ని పరిశీలిస్తున్న క్రైమ్ ఏసీపీ శశాంకర్‌రెడ్డి, సీఐ కాంతారెడ్డి

డ్రగ్స్ నివారణపై అవగాహన సదస్సులో మాట్లాడుతున్న ఎస్సై రజినికార్

మాదక ద్రవ్యాలతో భవిష్యత్ నాశనం

మంచాల, ఆగస్టు 20: మాదకద్రవ్యాల అలవాటుతో విద్యార్థుల భవిష్యత్ నాశనమవుతుందని, వాటి నివారణ కోసం ప్రతి ఒక్కరూ సమష్టిగా కృషి చేయాలని మంచాల ఎస్సై రజినీకర్ అన్నారు. మంగళవారం మంచాల మండలం నోముల మహాత్మా జ్యోతిరావు పూలే గురుకుల పాఠశాల, కళాశాలలో యాంటీ డ్రగ్స్ నివారణపై మంచాల పోలీసుల ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ.. డ్రగ్స్, గంజాయి వంటి మత్తు పదార్థాలకు అలవాటు పడితే జీవితాలు అంధకారమయంగా మారుతాయని చెప్పారు. ప్రతి విద్యార్థి కష్టపడి చదవడమే కాకుండా క్రమశిక్షణతో మెలిగి తాను అనుకున్న లక్ష్యాన్ని సాధించుకోవాలని కోరారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కిరణ్‌తో పాటు ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

వైద్య శిబిరంలో రోగులకు సూచనలిస్తున్న వైద్యుడు అఖిల్

కడ్తాల్, ఆగస్టు 20: సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మిషన్ భగీరథ మాజీ వైస్ చైర్మన్ ఉప్పల వెంకటేశ్ అన్నారు. మంగళవారం తలకొండపల్లి మండల పరిధిలోని జంగారెడ్డిపల్లి గ్రామంలో ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో డాక్టర్ అఖిల్ పర్యవేక్షణలో ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వానకాలంలో వ్యాధులు ప్రబలకుండా ఉండేందుకు పరిసరాల శుభ్రతతో పాటు నీటి నిల్వలు ఉండకుండా చూసుకోవాలని సూచించారు. శిబిరంలో 196 మందికి పరీక్షలు నిర్వహించి మందులు అందజేసినట్లు వైద్యులు తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ నిర్మలశ్రీశైలంగౌడ్, మాజీ ఉపసర్పంచ్‌లు మల్లేశ్, చంద్రమౌళి, నాయకులు మోహన్‌రెడ్డి, మధు, మహేశ్, వంశీ, శివ, మైసయ్య, మల్లయ్య, పెంటయ్య, లక్ష్మయ్య, నర్సింహ పాల్గొన్నారు.

పోలీసులకు రాఖీలు కట్టిన బ్రహ్మకుమారీలు

షాబాద్, ఆగస్టు 20: బ్రహ్మకుమారీల ఆధ్వర్యంలో రక్షాబంధన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. మంగళవారం షాబాద్ మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో బ్రహ్మకుమారీ విజయ ఆధ్వర్యంలో సీఐ కాంతారెడ్డి, ఎస్ఐలు మహేశ్వర్‌రెడ్డి, నవీన్‌రెడ్డికి రాఖీలు కట్టి రక్షాబంధన్ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ...ప్రతి ఏడాది రక్షాబంధన్ కార్యక్రమాన్ని బ్రహ్మకుమారీల ఆధ్వర్యంలో ఘనంగా జరుపుకొంటున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సభ్యులు బస్వరాజ్, శకుంతల, మంజుల పాల్గొన్నారు.

పారిశ్రామికవేత్తలుగా ఎదుగాలి

ఆదిబట్ల మున్సిపల్ చైర్మన్ నిరంజన్‌రెడ్డి

మహిళా సంఘాలతో సమావేశం

ఆదిబట్ల, ఆగస్టు 20: ప్రతి మహిళా పారిశ్రామికవేత్తలుగా ఎదుగాలని ఆదిబట్ల మున్సిపాలిటీ చైర్మన్ మర్రి నిరంజన్‌రెడ్డి అన్నారు. మంగళవారం మున్సిపల్ కార్యాలయంలో మహిళా సంఘాలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మహిళల అభ్యున్నతికి ప్రవేశపెట్టిన మహిళా శక్తిపథకంలో భాగంగా మహిళా శక్తి క్యాంటీన్, మహిళా శక్తి మీసేవా, మహిళా శక్తి ఈవెంట్‌మేనేజ్‌మెంట్, మహిళా శక్తి క్యాటరింగ్, మహిళా శక్తి ఫుడ్ ప్రాసెసింగ్ సర్వీస్, కన్‌స్ట్రక్షన్ ఎక్విప్‌మెంట్ వంటి యూనిట్లను ఏర్పాటు చేయడంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ప్రతి మహిళా ఈ పథకాలతో ఆర్థికంగా మరింత అభివృద్ధి చెందాలని అన్నారు. కార్యక్రమంలో శ్రీనిధి మేనేజర్‌తో పాటు మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

మహిళా శక్తి పథకంపై అవగాహన కల్పిస్తున్న మున్సిపల్ చైర్మన్ నిరంజన్‌రెడ్డి

ఎల్ఆర్ఎస్‌పై హెల్ప్ డెస్క్

కొత్తూరు, ఆగస్టు 20: ఎల్ఆర్ఎస్ 2020పై హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేస్తున్నామని కొత్తూరు మున్సిపల్ కమిషనర్ బాలాజీ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కలెక్టర్ ఆదేశాల మేరకు ఈ నిర్ణయం తీసుకున్నామని వివరించారు. మున్సిపాలిటీ పరిధిలోని ఎల్ఆర్ఎస్‌పై ఏమైనా సమస్యలు ఉంటే టౌన్ ప్లానింగ్ అధికారి శ్రీనివాస్ 9912789197, టౌన్ ప్లానింగ్ సూపర్‌వైజర్ (హెల్ప్ డెస్క్ ఇన్‌చార్జి) హనుమంతు 9949848609, ఆపరేటర్ సత్యం 9010034448 నంబర్లలో సంప్రదించాలని బాలాజీ వివరించారు.

రాజీవ్ గాంధీ సేవలు చిరస్మరణీయం

ఎమ్మెల్యే కాలె యాదయ్య

రాజీవ్ గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే కాలె యాదయ్య

చేవెళ్లటౌన్, ఆగస్టు 20: మాజీ ప్రధాని, దివంగత రాజీవ్ గాంధీ దేశానికి చేసిన సేవలు చిరస్మరణీయమని ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. రాజీవ్ గాంధీ జయంతి సందర్భంగా మంగళవారం చేవెళ్ల మండల కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆయన విగ్రహానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు ఆగిరెడ్డి, శంకర్‌యాదవ్, మాజీ ఎంపీటీసీ రాములు ఉన్నారు.

ఆమనగల్లు : భారత మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ జయంతిని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు తెల్గమల్ల జగన్ ఆధ్వర్యంలో ఆమనగల్లు పట్టణంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రాజీవ్‌గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పీసీసీ సభ్యుడు శ్రీనివాస్‌గౌడ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సింహ, మాజీ జడ్పీటీసీ సభ్యుడు శ్రీనివాస్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు మానయ్య, బ్లాక్ ఉపాధ్యక్షుడు బిచ్యనాయక్, ఖలీల్, ధనంజయ, మైనార్టీ నాయకులు అబ్దుల్‌ఖాదర్, యాదయ్య, మల్లయ్య, బాబా, సురేశ్, అలీం, సురేశ్, శేఖర్‌గౌడ్, శ్రీకాంత్, ఫరీద్, నాజర్, ఫీరోజ్, విజయ్, మహేశ్, మల్లేశ్, రఫీ, హరిలాల్, చంద్రు, వెంకటేశ్, శ్రీనివాస్‌రెడ్డి, అలీ పాల్గొన్నారు.

మొయినాబాద్ : మండల పరిధిలోని హిమాయత్‌నగర్ చౌరస్తాలో ఉన్న రాజీవ్‌గాంధీ విగ్రహానికి కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మానెయ్య ఆధ్వర్యంలో నివాళులర్పించారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు గౌరీసతీశ్,షాబాద్ దర్శన్, రాములు, పీఏసీఎస్ చైర్మన్ చంద్రారెడ్డి, నాయకులు రాములు, ఆంజనేయులుగౌడ్, మీనాజుద్దీన్, వెంకట్‌రెడ్డి, కృష్ణారెడ్డి, వెంకట్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, నర్సింగ్‌రావు, విజయరాజు, వాసుదేవ్, మల్లేశ్‌గౌడ్ పాల్గొన్నారు.

ప్రభుత్వ ఉద్యోగులకు బదిలీ సహజం

కడ్తాల్, ఆగస్టు 20: ప్రభుత్వ ఉద్యోగులకు బదిలీలు సాధారణమని, అంకితభావంతో పనిచేసే ఉద్యోగులకు సమాజంలో గుర్తింపు ఉంటుందని సీఐ శివప్రసాద్ అన్నారు. కడ్తాల్ పోలీస్‌స్టేషన్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న, చందగోపాల్ ఏఎస్ఐ పదోన్నతి లభించి షాద్‌నగర్ పోలీస్‌స్టేషన్‌కు బదిలీ అయ్యారు. ఈ మేరకు మంగళవారం పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో పోలీసులు ఆయనను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ విధి నిర్వహణలో ప్రభుత్వ ఉద్యోగులకు బదిలీలు, పదోన్నతులు సాధారణమని తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఐ వరప్రసాద్, ఏఎస్ఐలు నిరంజన్, ప్రసాద్‌జీ, సిబ్బంది పాల్గొన్నారు.

గుంతల పూడ్చివేత

రోడ్డుపై గుంతలను పూడ్చి వేస్తున్న సీఐ వెంకటేశం

చేవెళ్లటౌన్, ఆగస్టు 20: చేవెళ్ల మండల కేంద్రంలోని హైదరాబాద్ – బీజాపూర్ రహదారి చేవెళ్లలోని కేజీఆర్ గార్డెన్ ఎదుట వర్షం పడి రోడ్డుపై నీళ్లు నిలిచాయి. ప్రయాణికుల రాకపోకలకు ఇబ్బందులు తలెత్తడంతో చేవెళ్ల ట్రాఫిక్ సీఐ వెంకటేశం సిబ్బందితో కలిసి కంకర, సిమెంట్ పోయించి గుంతలను పూడ్చి వేశారు. కార్యక్రమంలో చేవెళ్ల ట్రాఫిక్ పోలీసులు ఉన్నారు.

రైలు కింద పడి యువకుడి ఆత్మహత్య

ఖాజా పాషా(ఫైల్)

నందిగామ, ఆగస్టు 20: రైలు కింద పడి యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన నందిగామ మండల కేంద్రంలో మంగళవారం చోటు చేసుకుంది. రైల్వే పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నందిగామ గ్రామానికి చెందిన ఖాజా పాషా(22) నందిగామ మండలం చంద్రయాన్ గూడ గ్రామ శివారులో రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. షాద్‌నగర్ స్టేషన్ మాస్టర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రైల్వే హెడ్ కానిస్టేబుల్ మల్లేశ్వర్ తెలిపారు.

బస్టాండ్ నిర్మాణ పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కాలె యాదయ్య

త్వరలో బస్టాండ్‌ను అందుబాటులోకి తెస్తాం

ఎమ్మెల్యే కాలె యాదయ్య

చేవెళ్లటౌన్, ఆగస్టు 20: చేవెళ్ల నూతన బస్టాండ్‌ను తొందరలోనే ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామని ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. మంగళవారం చేవెళ్ల మండల కేంద్రంలో నిర్మిస్తున్న బస్టాండ్ పనులను ఎమ్మెల్యే నాయకులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంట్రాక్టర్లకు సూచించారు. త్వరలోనే పనులు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తెచ్చే విధంగా కృషి చేస్తామన్నారు. ఎమ్మెల్యే వెంట పీఏసీఎస్ చైర్మన్లు దేవర వెంకట్ రెడ్డి, మాజీ సర్పంచ్‌లు ఆగిరెడ్డి, శంకర్ యాదవ్, గోనే ప్రతాప్‌రెడ్డి, ఉప సర్పంచ్ శ్రీనివాస్‌యాదవ్, నాయకులు ప్రభాకర్, పెంటయ్య ఉన్నారు.

అథ్లెట్ శంకర్‌ను యువత ఆదర్శంగా తీసుకోవాలి

ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌కు తన మెడల్స్‌ను చూపిస్తున్న అథ్లెట్ శంకర్

షాద్‌నగర్‌టౌన్, ఆగస్టు 20: షాద్‌నగర్‌కు చెందిన అథ్లెట్ శంకర్‌ను యువత ఆదర్శంగా తీసుకుని క్రీడల్లో రాణించాలని ఎమ్మెల్యే వీర్ల పల్లి శంకర్ అన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని రాజమండ్రిలో ఉద్యోగం చేస్తున్న అథ్లెట్ శంకర్ మంగళవారం ఎమ్మెల్యే వీర్ల పల్లి శంకర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గిరిజన తండాలో జన్మించిన అథ్లెట్ శంకర్ అంతర్జాతీయ స్థాయిలో అనేక పతకాలను సాధించడం గర్వకారమన్నారు. అథ్లెట్ శంకర్‌ను యువత ఆదర్శంగా తీసుకుని క్రీడా రంగంలో లక్ష్యాలను సాధించే దిశగా ముందుకుసాగాలన్నారు. శంకర్‌కు ప్రభుత్వ పరంగా ఆర్థిక భరోసా కల్పిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు.

మొయినాబాద్‌లో బదిలీపై వెళ్లిన ఏవో రాగమ్మను సన్మానిస్తున్న ఫెర్టిలైజర్ డీలర్లు, నాయకులు

వ్యవసాయ అధికారిణికి ఘన సన్మానం

మొయినాబాద్, ఆగస్టు 20 : మొయినాబాద్ మండల వ్యవసాయ అధికారిగా బాధ్యతలు నిర్వహించిన వ్యవసాయ అధికారి రాగమ్మ బదిలీ కావడంతో మంగళవారం జిల్లా వ్యవసాయ అధికారి గీతారెడ్డి సమక్షంలో వీడ్కోలు పలికి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సంధ్య, ఎంఈవో వెంకటయ్య, ఏఈవోలు కుమార్, సునీల్, ఫెర్టిలైజర్ డీలర్లు బాల్‌రెడ్డి, నిరంజన్‌రెడ్డి, భానుప్రతాప్‌గౌడ్, రంగారెడ్డి, కొమురయ్య, శ్రీరాం నగర్ సర్పంచ్‌లు ప్రభాకర్‌రెడ్డి, టి. మాణెయ్య, నాయకులు నీలకంఠం, కాశీం బౌలి మాజీ సర్పంచ్ జి. మహేందర్‌రెడ్డి, తోలుకట్టా మాజీ సర్పంచ్ సత్యనారాయణ, మోత్కుపల్లి మాజీ సర్పంచ్ కె. రత్నం, నాయకులు వెంకట్‌రెడ్డి, నర్సింహారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, ఎల్లయ్యగౌడ్, రవీందర్‌రెడ్డి, రైతులు వీరప్ప, బస్వరాజు, మాజీ జడ్పీటీసీ కోంపల్లి అనంతరెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ చంద్రారెడ్డి, ఎం నర్సింహారెడ్డి, హనుమంత్‌రెడ్డి, కీసరి సంజీవరెడ్డి, డి.కృష్ణారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి ఉన్నారు.

మొయినాబాద్ వ్యవసాయ అధికారిగా అనురాధ

అనురాధ

మొయినాబాద్ మండల వ్యవసాయ అధికారిగా అనురాధ మంగళవారం బాధ్యతలు చేపట్టారు. 13 ఏండ్ల పాటు మొయినాబాద్ ఏవోగా బాధ్యతలు నిర్వహించిన రాగమ్మ బదిలీపై వెళ్లారు. ఆమె స్థానంలో రాజేంద్రనగర్‌లోని ఫర్టిలైజర్ కంట్రోలర్ ఆర్డర్ ల్యాబ్‌లో విధులు నిర్వహించిన అనురాధ మొయినాబాద్ ఏవోగా బదిలీపై వచ్చారు. మంగళవారం బాధ్యతలు చేపట్టి విధుల్లో చేరారు. బదిలీపై వెళ్లిన రాగమ్మ రాజేంద్రనగర్‌లోని ఫర్టిలైజర్ కంట్రోలర్ ఆర్డర్ ల్యాబ్‌కు వెళ్లారు.

అదుపు తప్పిన స్కూల్ బస్

భయాందోళనకు గురైన విద్యార్థులు

మొయినాబాద్, ఆగస్టు 20: స్కూల్ బస్ అదుపు తప్పి రోడ్డు కిందకి దూసుకెళ్లిన ఘటన మొయినాబాద్ మండల పరిధిలోని మోత్కుపల్లి రోడ్డులో మంగళవారం ఉదయం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని చిలుకూరు గ్రామంలో ఉన్న శివసాయి ఇంటర్నేషనల్ స్కూల్ బస్ చిన్నమంగళారం, మోత్కుపల్లి గ్రామాల్లో విద్యార్థులను తీసుకెళ్తుండగా డ్రైవర్ నిర్లక్ష్యంతో అతివేగంగా బస్సు నడపటంతో అదుపు తప్పి రోడ్డు కిందకి దూసుకెళ్లింది. దీంతో బస్‌లో ఉన్న విద్యార్థులు అంతా ఒక్కసారిగా భయాందోళనకు గురయ్యారు. వెంటనే స్థానికులు అక్కడికి చేరుకుని బస్సులో ఉన్న విద్యార్థులందరినీ కిందకి దింపారు. విద్యార్థులకు ఎలాంటి గాయాలు కాకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. డ్రైవర్ నిర్లక్ష్యం వల్లే